సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



మాదిగల సంబరాలు

ఎస్సీ వర్గీకరణను అమలు చేసే అధికారం రాష్ట్రాలకే అప్పగిస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో జిల్లాలో మాదిగ కులస్తులు సంబరాలు చేసుకున్నారు. IIIలో▸



సాఠే ఆశయాలు కొనసాగించాలి

అన్నా బావుసాఠే ఆశయాలు కొనసాగించాలని నాయకులు సూచించారు. సాఠే జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
29.0/25.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ట్రాక్టర్‌పై వెళ్లి పనులు పరిశీలించిన డీఆర్డీవో



ట్రాక్టర్‌పై వెళ్తున్న డీఆర్డీవో సాయన్న

తాంసి: మండలంలోని గోట్కూరి గ్రామంలో గురువారం డీఆర్డీవో సాయన్న బృహత్ పల్లె ప్రకృతివనం పనులను పరిశీలించారు. గోట్కూరి గ్రామానికి అవతలి వైపు ఉన్న ప్రకృతి వనానికి వెళ్లాలంటే వాగు దాటాల్సి ఉంది. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో గ్రామపంచాయతీ ట్రాక్టర్‌పై అధికారులతో కలిసి పీడీ వాగు దాటారు. ప్రకృతివనంలో మొక్కలు నాటడానికి చేపట్టిన పనులు పరిశీలించారు. ఐదువేల నీలగిరి మొక్కలు వెంటనే నాటాలని ఆదేశించారు. అనంతరం నర్సరీని సందర్శించారు. ఏపీవో విజయ, ఈసీ గంగయ్య, టెక్నికల్ అసిస్టెంట్ మహేశ్, నాయకులు దేవిదాస్, రోహిత్ ఉన్నారు.

కుప్టి ప్రాజెక్ట్ స్థల పరిశీలన




స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నేరడిగొండ: కుప్టి ప్రాజెక్ట్ కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.234 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కడెం పరీవాహక ప్రాంతమైన కుప్టి వద్ద నిర్మించనున్న ప్రాజెక్ట్ స్థలాన్ని ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు గురువారం పరిశీలించారు. సమాచారం తెలుసుకున్న కుమారి, గాజిలి, గాంధారి, కుప్టి గ్రామాల ప్రజలు అక్కడకు చేరుకుని అధికారులతో మాట్లాడారు. 900 ఇళ్లు, 2వేల ఎకరాల సాగుభూమి ముంపునకు గురి కానుందని.. పరిహారం, పునరావాసంపై తేల్చాకే పనులు ప్రారంభించాలని కోరారు. కాగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే స్థలాన్ని పరిశీలించినట్లు ఇరిగేషన్ డీఈ భీంరావు, ఏఈ జాదవ్ ప్రకాశ్, తహసీల్దార్ మహేశ్, ఆర్ఐ నాగోరావు తెలిపారు.

మాస్టర్ ట్రైనర్లుగా ఎంపిక

కైలాస్‌నగర్: గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఓటర్ల జాబితా తయారీకి మాస్టర్ ట్రైనర్ల వివరాలు పంపించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం జరిగే శిక్షణ కోసం మాస్టర్ ట్రైనర్లుగా ఈ పంచాయతీ డిస్ట్రిక్ ప్రోగ్రాం మేనేజర్ శ్రావణ్‌కుమార్, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చించుఘాట్, భీంసరి పంచాయతీ కార్యదర్శులు అశోక్ కుమార్, మల్లారెడ్డి, మావల, ఉట్నూర్ మండల కేంద్రాల్లోని ఆపరేటర్లు ప్రవీణ్, చంద్రమౌళిని ఎంపిక చేశారు. వీరంతా శుక్రవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఓటర్ల జాబితాపై నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం జిల్లాలోని పంచాయతీ అధికారులు, కార్యదర్శులకు వీరు త్వరలో శిక్షణ ఇస్తారు.

అంబులెన్స్ ప్రారంభం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: బెస్ట్‌ఫ్రెండ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో రిమ్స్‌కు వచ్చే రోగుల కోసం ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ గురువారం ప్రారంభించారు. బెస్ట్‌ఫ్రెండ్ వెల్ఫేర్ స్వచ్ఛంద సంస్థ సేవలను అభినందించారు. రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, సొసైటీ అధ్యక్షుడు అజీజ్, సతీశ్, సాబిర్ హుస్సేన్, శ్రీకాంత్, ఆసిఫ్ అలీ, భువనసింగ్, ప్రసన్న, మానిశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ గౌస్ ఆలం ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా బహిరంగ సభలు, ఊరేగింపులు, ఆందోళనలు చేపట్టరాదని పేర్కొన్నారు. డీఎస్పీ అనుమతి పొందాకే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆగస్టు 1నుంచి 31 సాయంత్రం 6గంటల వరకు యాక్ట్ అమలులో ఉంటుందని వివరించారు.

ఇది ఇచ్చోడ మండలం అడెగామ(బి)లో ఓ రైతు చేనులోని బావి. ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా నిండింది. భూ ఉపరితలానికి సమాంతరంగా నీళ్లు చేరాయి. ఈ గ్రామానికో ప్రత్యేకత ఉంది. గ్రామంలోని అనేక వ్యవసాయ భూముల్లో ఇలాంటి బావులే కనిపిస్తాయి. బోర్లు చాలా తక్కువగా ఉంటాయి. వానాకాలం వచ్చిందంటే ఈ బావుల్లో ఇలా నిండుగా నీళ్లుంటాయి



జలం.. పుష్కలం

- సాధారణం కంటే అధిక వర్షాలు
- జిల్లాలో పెరిగిన భూగర్భజలాలు
- నగటున 3.92మీటర్ల లోతులోనే..
- తొమ్మిదిచోట్ల 1.50మీటర్ల లోపే..
- ఇంకుడుగుంతలతో మరింత వృద్ధి

గతేడాది, ప్రస్తుత నీటి లభ్యత వివరాలు

జూలై 2023	3.30 మీటర్లు
మే 2024	10.59 మీటర్లు
జూన్ 2024	8.29 మీటర్లు
జూలై 2024	3.93 మీటర్లు

సాక్షి, ఆదిలాబాద్: జిల్లాలో నగటున భూ ఉపరితలం నుంచి 3.92 మీటర్ల లోతులోనే నీటి లభ్యత ఉంది. జూన్ 1నుంచి మొదలుకుని ఆగస్టు 1 వరకు జిల్లాలో వానలు కురిశాయి. సాధారణ వర్షపాతం 538.3 మిల్లీ మీటర్లు కాగా, ఇప్పటివరకు 653.7 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఇది సాధారణం కంటే 21 శాతం అధికం. జిల్లాలోని అన్ని మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. జూన్ కంటే జూలైలో 4.05 మీటర్లు భూగర్భ జలాలు పెరగడం గమనార్హం. భారీ వర్షాలు కురవడంతో ఈ ఒక్క నెలలోనే భారీగా పెరుగుదల నమోదైంది.

అర్జునిలో ఓవర్‌ఫ్లో..

జిల్లాలోని కొన్ని గ్రామాల్లో నీళ్ల పొంగిపొర్లే పరిస్థితి ఉందని అధికారులు తెలిపారు. గాదిగూడ మండలం అర్జుని గ్రామంలో 0.02 మీట ర్లలోనే నీటి లభ్యత ఉంది. నార్నూర్‌లో 0.85, జైనథ్‌లో 0.90, ఇచ్చోడ మండలం నర్సాపూర్‌లో 1.00, ఆదిలాబాద్‌రూరల్ మండలం పిప్పల్‌ధరిలో 1.20, ఇచ్చోడలో 1.25, గాదిగూడలో 1.40, నేరడిగొండ మండలం కుంటాలలో 2.50, ఆదిలాబాద్‌రూరల్ మండలం యాపల్‌గూడలో 3.0 మీటర్లలోనే ఉంది.

జిల్లాలో 26 చోట్ల కొలతలు

భూగర్భజలశాఖ ఆధ్వర్యంలో ప్రతీనెల 20 నుంచి 25వ తేదీ మధ్య జిల్లాలోని భూగర్భ జలాలను కొలుస్తారు. ఫిజియోమీటర్ల ద్వారా కొలతలు తీస్తారు. ఇలాంటివి జిల్లాలో 26 చోట్ల ఏర్పాటు చేశారు. జిల్లాలో అత్యధికంగా నల్లరేగడి (బేసాల్ట్) భూములున్నాయి. వీటిలో నీటి లభ్యత తక్కువే ఉంటుందని భూగర్భజలశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో భూగర్భ జలాల పెంపు కోసం నీటికుంటలు, ఇంకుడు గుంతలు లాంటివి ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు.

రీచార్జి పద్ధతులు పాటించాలి



రాబోయే తరాలకు నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రజలు రీచార్జి పద్ధతులు పాటించాలి. నీటి కుంటలు, ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి. వీటి ద్వారా జలాలు రీచార్జి అవుతాయి.

– శ్రీవల్లి, ఏడీ, భూగర్భ జలశాఖ

‘మహిళలను కించపరచడం సిగ్గుచేటు’



నిరసన తెలుపుతున్న రామన్న, నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలను కించపర్చడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి కుమురంభీం చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడే బైఠాయించి ప్లకార్డులు ప్రదర్శించారు. సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం అక్కడినుంచి వెళ్లి జగ్జీవన్‌రావు చౌక్ వద్ద బైఠాయించారు. పోలీసులు వారిని సముదాయించి అక్కడినుంచి పార్టీ కార్యాలయానికి పంపించారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ.. అసెంబ్లీలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతపై సీఎం అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. వెంటనే వారికి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు అజయ్, పవన్‌నాయక్, ప్రకాశ్, రమేశ్, సాజిదొద్దీన్, యూనుస్ అక్బాని, మెట్టు ప్రహ్లాద్, నారాయణ, శివకుమార్, స్వరూప, మమత, కస్తాల ప్రేమల తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ సర్టిఫికెట్లు అందజేత



విద్యార్థినికి సర్టిఫికెట్ ఇస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: బెంగళూర్‌కు చెందిన క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ కింద పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన జిల్లాలోని ఇద్దరు విద్యార్థులకు ఉపకారవేతనాలు ప్రకటించింది. జిల్లా కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థిని కనక పూజ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని మల్కన్ నందానికి ఇంటర్మీడియట్ చదువుల కోసం ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున స్కాలర్‌షిప్‌ను వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేసింది. గురువారం కలెక్టర్ రాజర్షి షా తన క్యాంపు కార్యాలయంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్ సర్టిఫికెట్లు అందజేశారు. వారిని అభినందించి చదువులో మరింత ఉన్నతంగా రాణించాలని సూచించారు. కంపెనీ డివిజనల్ మేనేజర్ జగదీశ్, ఏరియా బ్రాంచ్ మేనేజర్ పాల్గొన్నారు.

డీసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: డైట్ కళాశాలల్లో ప్రవేశాల కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో గురువారం డీసెట్ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. అధికారులు అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. మొదటిరోజు 550 మంది అభ్యర్థులకు 436 మంది హాజరు కాగా, 114 మంది గైర్హాజరైనట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 6వరకు ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. జిల్లాకు 2,600 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కోసం కేటాయించినట్లు తెలిపారు. రోజుకు 550 మంది సర్టిఫికెట్లు పరిశీలించనున్నట్లు వివరించారు. డైట్ కళాశాల సూపరింటెండెంట్ భోజన్న, లెక్చరర్లు స్వర్ణకుమారి, ఉద్యోగులు వేణు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న విలాస్

ఎదులాపురం: కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏఐటీయూసీ పని చేస్తోందని రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం మార్బుల్, టైల్స్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి విలాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు కార్మిక శాఖ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని కోరారు. మార్బుల్, టైల్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా బహదూర్ చౌస్, ఉపాధ్యక్షుడిగా సిరాజ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్కే అస్లాం, సంయుక్త కార్యదర్శిగా అజీంఖాన్, కోశాధికారిగా ఇర్ఫాన్ ఖాన్, సభ్యులుగా లాల్‌చంద్, అలోక్, ముఖేశ్‌రాజ్, వాజిద్ తదితరులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాజుంగుల రాజు, సీపీఐ కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

- రుణాలు మాఫీ చేయాలని డిమాండ్

బ్యాంక్ ఎదుట రైతుల ఆందోళన



బ్యాంక్ ఎదుట బైఠాయించిన రైతులు, నాయకులు

గుడిహత్నూర్: అర్హతలున్నా పంటరుణాలు మాఫీ కాలేదని ఆరోపిస్తూ బీజేపీ రైతు మోర్చా నాయకులు, ఆయా గ్రామాల రైతులు మండల కేంద్రంలోని మహారాష్ట్ర బ్యాంక్ ఎదుట గురువారం బైఠాయించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ మాట్లాడారు. మహారాష్ట్ర బ్యాంక్‌లో సుమారు 3వేల మంది రైతులు పంటరుణాలు తీసుకోగా 494 మందికే మాఫీ అయినట్లు తెలిపారు. మిగతా రైతులకు రూ.వందల్లో మాఫీ కావడం ఏమిటని ప్రశ్నించారు. బ్యాంకర్ల తప్పిదంతో రైతులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఆగస్టు 15లోగా అర్హులందరికీ రుణమాఫీ చేయకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న సీఐ భీమేశ్, ఎస్సై ఇమ్రాన్ ఆందోళనకారులను సముదాయించే ప్రయత్నం చేశారు. కాగా, ఉన్నతాధికారులకు సమస్య నివేదిస్తామని బ్యాంక్ అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు, నాయకులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కేంద్రే శివ, నాయకులు బోసారే గణేశ్, కుమార్, జాలీం తదితరులున్నారు.

జూనియర్ కళాశాలల్లో బదిలీలు



ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేటర్లకు బుధవారం రాత్రి బదిలీలు జరిగాయి. వీరంతా గురువారం రిలీవై కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న భగవాండ్లు బేల కళాశాలకు, బేలలో పనిచేస్తున్న సూర్యప్రకాశ్ ఆదిలాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు, బాలుర జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కోవ విఠల్ బోథ్‌కు, బోథ్‌లో పనిచేస్తున్న బోరే శంకర్ ఇచ్చోడ కళాశాలకు, ఇచ్చోడలో పనిచేస్తున్న గణేశ్ ఆదిలాబాద్ ప్రభుత్వ బాలికల కళాశాలకు, ఉట్నూర్‌లో పనిచేస్తున్న పవన్‌కుమారి జనగామ జిల్లాకు, ఇంద్రవెల్లిలో పనిచేస్తున్న ధన్‌రాజ్ ఉట్నూర్‌కు, నిర్మల్ జిల్లాలోని సారంగపూర్‌లో పనిచేస్తున్న మారుతి ఇంద్రవెల్లికి, నార్నూర్‌లో పనిచేస్తున్న మహేంద్రకుమార్ కరీంనగర్ జిల్లాలోని సైదాపూర్‌కు బదిలీ అయ్యారు. కాగా, నార్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మినహా మిగతా చోట్ల ప్రిన్సిపాల్ పోస్టులు భర్తీ అయ్యాయి. బేల కళాశాలలో ఐదుగురు, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎనిమిది మంది, బాలికల కళాశాలల్లో ఆరుగురు, ఇంద్రవెల్లి కళాశాలలో ఆరుగురు, నార్నూర్‌లో ఒకరు, నేరడిగొండలో ఒకరు, ఉట్నూర్‌లో ఆరుగురు, గుడిహత్నూర్‌లో నలుగురు, బోథ్‌లో ఒకరు, ఇచ్చోడలో ముగ్గురు, తలమడుగులో ఒకరు, బజార్‌హత్నూర్‌లో ఒకరు చొప్పున లెక్చరర్లు, సిబ్బంది బదిలీ అయ్యారు.

ఐసీడీఎస్‌లో..

మహిళా శిశు సంక్షేమ శాఖలో పనిచేసే అధికారులు, ఉద్యోగులకు గురువారం బదిలీలు జరిగాయి. ఉట్నూర్ సీడీపీవో శ్రావణి చెన్నూర్‌కు బదిలీ కాగా, ఆమె స్థానంలో బెల్లంపల్లి సీడీపీవో మాస ఉమాదేవి వచ్చారు. ఆదిలాబాద్‌అర్బన్‌లో గ్రేడ్–1 సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న రాధ, గౌరి, విజయను జైనథ్ ప్రాజెక్ట్‌కు బదిలీ చేశారు. ఉట్నూర్‌లో పనిచేసే గ్రేడ్–2 సూపర్‌వైజర్ అనిత ఆదిలాబాద్‌అర్బన్‌కు, ఆదిలాబాద్ అర్బన్‌లో పనిచేసే గ్రేడ్–2 సూపర్‌వైజర్ పద్మ ఉట్నూర్‌కు బదిలీ అయ్యారు. వీరితో పాటు జిల్లాలోని ఆయా ప్రాజెక్టుల్లో సూపర్‌వైజర్లకు స్థానచలనం జరిగింది. వీరంతా కేటాయించిన స్థానాల్లో శుక్రవారం విధుల్లో చేరనున్నారు.

పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి

కైలాస్‌నగర్: పరిశ్రమల స్థాపనతో జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తుందని, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలను తయారు చేసేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జిలా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు మాట్లాడుతూ.. టీజీ ఐపాస్‌లో పెండింగ్‌లో ఉన్న అనుమతులపై చర్చించామని చెప్పారు. టీ ప్రైడ్ ద్వారా ఎనిమిదిమంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.26.76 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, ఎల్డీఎం ఉత్పల్‌కుమార్ తదతరులు పాల్గొన్నారు.

శాస్త్రీయంగా ఎస్టీ వర్గీకరణ చేపట్టాలి

ఆదిలాబాద్: శాస్త్రీయంగా ఎస్టీ వర్గీకరణ చేపట్టాలని మాజీ ఎంపీ సోయం బాపూరావు గురువారం ఓ ప్రకటనలో కోరారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సంబంధించి సానుకూలంగా తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. దశాబ్దాలుగా ఆదివాసీ హక్కుల కోసం సాగిస్తున్న పోరాటంతోనే నేడు సానుకూలమైన తీర్పు వచ్చిందని పేర్కొన్నారు. ఎస్టీ రిజర్వేషన్ల కోసం పక్క రాష్ట్రాల నుంచి వలస వచ్చిన లంబాడాలను తొలగించిన తర్వాతే వర్గీకరణ ప్రక్రియ చేపట్టాలని కోరారు. వలస లంబాడాలతో ఆదివాసుల అస్తిత్వం, హక్కులు హరించుకుపోతున్నాయని తెలిపారు. ఈ విషయమై తాము గతంలో అనేక ఉద్యమాలు చేశామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుప్రీం కోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పును స్వాగతించడంపై హర్షం వ్యక్తంజేశారు.

కృతజ్ఞత సభకు అధికసంఖ్యలో రావాలి

ఆదిలాబాద్‌టౌన్: హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించనున్న సీఎం కృతజ్ఞత సభకు ప్రమోషన్లు పొందిన వ్యాయామ ఉపాధ్యాయులంతా రావాలని జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పార్థసారథి, స్వామి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కలగా మిగిలిన ఉపాధ్యాయుల ప్రమోషన్లు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత తెలిపేందుకు ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పేటా సంఘం సభ్యులు రాజేశ్, నాందేవ్, రామ్‌కుమార్, జాదవ్ రవీందర్, అశ్వత్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, కృష్ణ, రాష్ట్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

5నుంచి ‘స్వచ్ఛదనం–పచ్చదనం’



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రాజర్షిషా, జిల్లా అధికారులు

కైలాస్‌నగర్: ఈ నెల 5నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కార్యక్రమానికి సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో ప్రజలు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. అధికసంఖ్యలో మొక్కలు నాటాలని, ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనం, పల్లె ప్రకృతి వనాల్లో చనిపోయిన మొక్కలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి నాటి సంరక్షించాలని పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని తెలిపారు. ప్రతీరోజు ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలని పేర్కొన్నారు. వ్యాధులు ప్రబలకుండా స్వచ్ఛమైన తాగు నీటిని అందించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు సమన్వయంతో పని చేయాలని, కార్యక్రమ విజయవంతానికి తగిన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఖుష్బూ గుప్తా, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జెడ్పీ సీఈవో కలిందిని, డీఆర్డీవో సాయన్న తదితరులు పాల్గొన్నారు.

భద్రత చర్యలు చేపట్టాలి



స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఐజీ, ఎస్పీ, సిబ్బంది

ఆదిలాబాద్: రైల్వేస్టేషన్‌లో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని ఆర్పీఎఫ్ డీఐజీ ఎండీ షాదాన్ జెబ్‌ఖాన్ సూచించారు. ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌ను గురువారం పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముందుగా ఎస్పీ గౌస్ ఆలం డీఐజీకి స్వాగతం పలికారు. అనంతరం డీఐజీ స్టేషన్‌లో తిరుగుతూ పరిసరాలను పరిశీలించారు. అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్టేషన్‌లోని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ స్టేషన్‌ను పరిశీలించి పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. భద్రత విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇన్‌స్పెక్టర్ సంజయ్, ఆర్పీఎఫ్ సిబ్బంది తదితరులున్నారు.

క్లుప్తంగా

కేకులో పురుగులు

బోథ్‌: బర్త్‌ డే వేడుక కోసం యువకులు తీసుకెళ్లిన కేకులో పురుగులు వచ్చిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ధన్నూర్‌(బి) గ్రామ యువకులు మంగళవారం తమ మిత్రుడి బర్త్‌ డే కోసం మండల కేంద్రంలోని ఓ బేకరీ షాపులో కేకు కొనుగోలు చేశారు. బాక్స్‌ తెరవగా కేకులో పురుగులు దర్శనమిచ్చాయి. యజమానిపై యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం క్రితం తయారుచేసిన కేకును తమకు అంటగట్టారని మండిపడ్డారు. ఫుడ్‌ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

పత్తి మొక్కలు తొలగించిన వ్యక్తిపై కేసు

నేరడిగొండ: చేనులో పత్తి మొక్కలు తొలగించిన ఘటనలో బుగ్గారం గ్రామానికి చెందిన రామారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. సవర్గాం గ్రామానికి చెందిన చౌహాన్‌ విలాస్‌ నేరడిగొండ నుంచి ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో శివాలయం వద్ద రామారావు తన భార్యతో గొడవ పడుతున్నాడు. చౌహాన్‌ విలాస్‌ తన కారును నిలిపి ఎందుకు గొడవపడుతున్నారని అడగగా, నువ్వెవరు నాకు చెప్పడానికి అని దుర్భాషలాడాడు. ఇది మనస్సులో పెట్టుకొని రామారావు చౌహాన్‌ విలాస్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలోని సుమారు 75 పత్తి మొక్కలు తొలగించాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇంట్లో చోరీకి యత్నం



దొంగ కదలికలు సీసీ పుటేజీలో రికార్డు అయిన దృశ్యం

బాసర: మండల కేంద్రంలోని అక్షర కాలనీకి చెందిన దీక్షిత్‌ చందు మహారాజ్‌ ఇంట్లో చోరీకి దొంగ యత్నించాడు. ఆ సమయంలో దీక్షిత్‌ కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం అర్ధరాత్రి దొంగ ఇంట్లో చొరబడేందుకు యత్నించగా, సీసీ పుటేజీలో రికార్డు అయింది. గురువారం దీక్షిత్‌ అందించిన సమాచారంతో ఎస్సై గణేశ్‌ అక్కడికి వెళ్లారు. అప్పటికే ఎస్సై, గ్రామ యువకులను చూసి ఓ వ్యక్తి వెనుక నుంచి పారిపోయినట్లు గుర్తించారు. త్వరలో దొంగను పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

బైక్‌ అదుపుతప్పి ఒకరికి గాయాలు

ఆసిఫాబాద్‌అర్బన్‌: మండలంలోని వాడిగుడ రహదారిపై గురువారం బైక్‌ అదుపు తప్పి ఒకరికి గాయాలయ్యాయి. మాలన్‌గొందికి చెందిన మడావి రవి తలకు, చెవికి గాయమైంది. పలువురు గమనించి అతన్ని ఆటోలో ఆసిఫాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి రెఫర్‌ చేశారు.

డ్రైవర్‌.. దొంగ!

- అద్దె వాహనం తీసుకొని.. అందినకాడికి దోచేశాడు
- ఓ టీచర్‌ ఫోన్‌పే నుంచి రూ.94,500 డ్రా
- మరో వ్యక్తిది రూ.2వేల నగదు, అర తులం బంగారం
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఆదిలాబాద్‌ డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్‌: సెల్ఫ్‌ వాహనాలను అద్దెకు తీసుకొని అందినకాడికి దోచేస్తాడు ఓ ఘరానా మోసగాడు. ఆదిలాబాద్‌రూరల్‌ మండలంలోని చిచ్‌ధరి ఖానాపూర్‌కు చెందిన రాథోడ్‌ యువరాజ్‌ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కాలంలో వేర్వేరు సమయాల్లో రెండు కార్లను అద్దెకు తీసుకొని నడిపించాడు. ఆ సమయంలో అందులో ప్రయాణించిన ఇద్దరు ఈయన చేతిలో మోసపోయారు. కాగా, నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను గురువారం ఆదిలాబాద్‌ డీఎస్పీ ఎల్‌.జీవన్‌రెడ్డి వెల్లడించారు.

ఏం జరిగిందంటే..

ఆదిలాబాద్‌లో సెల్ఫ్‌ డ్రైవ్‌ పేరిట ఓ టవేరా వాహనాన్ని అద్దెకు తీసుకొని హైదరాబాద్‌ నుంచి ఆదిలాబాద్‌ వరకు పలువురు ప్యాసింజర్లను తీసుకొచ్చాడు. అందులో ప్రయాణికుడు జాదవ్‌ గణేశ్‌ పరిచయం అయ్యాడు. ఆయన కూడా వృత్తిరీత్యా డ్రైవర్‌ కావడంతో స్నేహం పెంచుకున్నాడు. రిమ్స్‌ ఆస్పత్రి దగ్గరికి వచ్చిన క్రమంలో తనకు తల తిరుగుతుందని, ఈ వాహనాన్ని అడ్డా వద్ద యజమానికి అప్పగించాలని, అప్పటివరకు తాను ఇక్కడే ఉంటానని నమ్మించాడు. ఆయన వద్ద ఉన్న పర్సు, బ్యాగు తనకు ఇవ్వమని, తాను జాగ్రత్తగా ఉంచుతానని నమ్మబలికాడు. అందులో రూ.2,500 నగదుతోపాటు 5 గ్రాముల బంగారం ఉంది. తాను తిరిగి వచ్చేసరికి కనిపించకుండా పోయాడు. ఈ ఘటన మే 31న చోటుచేసుకుంది. బాధితుడు టూటౌన్‌ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటినుంచి ఆయన పరారీలో ఉన్నాడు. ఇలా దొంగలించిన సొమ్ములతో పల్సర్‌ బైక్‌ను కొనుగోలు చేసి జల్సాలు చేసుకుంటున్నాడు. ఇదిలా ఉండగా, జూలై 2న సెల్ఫ్‌ డ్రైవ్‌ పేరిట షిఫ్ట్‌ వాహనాన్ని అద్దెకు తీసుకొని ఉట్నూర్‌ నుంచి ఆదిలాబాద్‌కు ప్రయాణికులను తరలిస్తున్నాడు. ఉట్నూర్‌లో జాదవ్‌ మోహన్‌ అనే టీచర్‌ ఈ వాహనంలో ఎక్కాడు. ఆయన నుంచి ఆదిలాబాద్‌కు వచ్చినందుకు రూ.100 చార్జీ తీసుకున్నాడు. సదరు టీచర్‌.. కేసీబీ గార్డెన్‌ వద్ద దిగాడు. అయితే అతను కారులో ఫోన్‌ మరిచిపోయాడు. అయితే యువరాజ్‌ ఆ ఫోన్‌ లాక్‌ను ఓపెన్‌ చేసి తన నంబర్‌కి కాల్‌ చేసుకుంటాడు. ఆ నంబర్‌ మొదటి ఆరు అంకెలను ఫోన్‌పేలో నమోదు చేయడంతో ఓపెన్‌ అవుతుంది. ఆదిలాబాద్‌లోని ఎస్‌బీఐ సేవా కేంద్రంలో రూ.94,500 డ్రా చేశాడు. దీంతో బాధితుడి మరో ఫోన్‌కు మెస్సేజ్‌ రావడంతో ఆయన కంగుతిన్నాడు. దీంతో మావల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. గత కొంత కాలంగా నిందితుడు పరారీలో ఉన్నాడు. పోలీసులు గురువారం జిల్లా కేంద్రంలో ఆయన్ను పట్టుకొని అరెస్టు చేశారు. నిందితుడి నుంచి దొంగలించిన సెల్‌ఫోన్, పల్సర్‌ బైక్‌తో పాటు నిందితుడి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిందితుడిపై ఇదివరకు 5 వివిధ కేసులు ఉన్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా నిందితుడిని పట్టుకున్న పోలీసులను అభినందించారు. అపరిచితులకు వాహనాలను అద్దెకు ఇవ్వొద్దని డీఎస్పీ సూచించారు. సమావేశంలో టూటౌన్‌ సీఐ కరుణాకర్‌రావు, ఆదిలాబాద్‌రూరల్‌ సీఐ ఫణిందర్, మావల ఎస్సై విష్ణువర్ధన్, టూటౌన్‌ పోలీసులు రమేశ్, నరేశ్, క్రాంతి, సుధాకర్‌రెడ్డి, నరేందర్, కరీం, రామన్న పాల్గొన్నారు.



శివాజీనగర్‌లో..

గుంతల రోడ్లు

జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు చేరింది. డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరు రహదారి చేరి కంపు కొడుతోంది. రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌ నిర్మల్‌



మున్సిపల్‌ చైర్మన్‌ ఇంటి వెనకాల..



ప్రియదర్శనగర్‌ నుంచి సాగర్‌కాలనీకి వెళ్లే రోడ్డు



ఎన్టీఆర్‌ మార్గ్‌ భాగ్యనగర్‌ చౌరస్తాలో..

అయ్యో.. ఆరాధ్య..!

- విద్యుదాఘాతంతో చిన్నారి మృత్యువాత
- రైస్‌కుక్కర్‌ కేబుల్‌ నోట్లో పెట్టుకోవడంతో షాక్‌



ఆరాధ్య మృతదేహం

కడెం: రైస్‌కుక్కర్‌ కేబుల్‌ చిన్నారి పాలిట మృత్యుపాశంగా మారింది. నోట్లో పెట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడింది. చిన్నారి మృతితో ఆ ఇంట్లో విషాదం నెలకొంది. ఈ సంఘటన నిర్మల్‌ జిల్లా కడెం మండలం కొత్తమద్దిపడగ గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుర్గం సుశీల, రాయలింగు దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురు ఆరాధ్య(ఏడాదిన్నర) విద్యుత్‌ బోర్డుకు పెట్టి ఉంచిన రైస్‌కుక్కర్‌ కేబుల్‌ను నోట్లో పెట్టుకోవడంతో విద్యుత్‌ షాక్‌కు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు ఖానాపూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆరాధ్య మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. 'అయ్యో ఆరాధ్య ఎంత పనాయే..' అంటూ తల్లిదండ్రులు విలపించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. చిన్నారి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మెరుగైన విద్యనందించాలి



వంట గదిని పరిశీలిస్తున్న కుష్బు గుప్తా

- ఐటీడీఏ పీవో కుష్బుగుప్తా



విద్యార్థులకు ప్రశ్నలు అడుగుతున్న ఐటీడీఏ పీవో కుష్బు గుప్తా

ఇంద్రవెల్లి: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందరించాలని ఐటీడీఏ పీవో కుష్బు గుప్తా అన్నారు. మండలంలోని పిట్టబొంగరం ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా స్టాక్‌ రిజిస్టార్‌ను పరిశీలించారు. తరగతి, వంట గదుల్లో నీరు నిల్వ ఉండడం, భోజనం మెనూ పాటించకపోవడం, రిజిస్టార్‌లో హాజరు వేయకపోవడం, సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హెచ్‌ఎంకి, ఎలాంటి అనుమతి లేకుండా సెలవు పెట్టిన పిట్టబొంగరం పీహెచ్‌సీ మెడికల్‌ ఆఫీసర్‌కు షోకాజు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. సులభ పద్ధతిలో విద్యాబోధన చేయాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. వర్షాల నేపథ్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో స్వర్ణకారుడి ఆత్మహత్య



గంగాధర్‌ (ఫైల్‌)

ఖానాపూర్‌: అప్పుల బాధతో స్వర్ణకారుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన స్వర్ణకారుడు బెజ్జారపు గంగాధర్, భార్య సంతోషి దంపతులకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఇందులో పెద్దకూతురికి ఇటీవల పెళ్లి అయింది. పెళ్లి ఖర్చుల కోసం అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపం చెందాడు. బుధవారం సాయంత్రం ఆయన షాపులో యాసిడ్‌ తాగాడు. ఈ విషయాన్ని ఫోన్‌ ద్వారా కుటుంబీకులు, స్థానికులకు తెలిపాడు. వారు అక్కడికి చేరుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం నిర్మల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి పంపించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనమేరకు హైదరాబాద్‌ గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు గురువారం మృతిచెందాడు. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వారెవ్వా 'గుర్రపు' సవారీ



ఓ పెద్దాయన ఎంత దూరమైన గత మూడేళ్లుగా మహేగిరి రాజా (గుర్రం)పై ప్రయాణం చేస్తున్నాడు. ఆయనే ఆనంద్‌ వాగ్మారే. మహారాష్ట్ర నాందేడ్‌ జిల్లా బోకర్‌ తాలూకా ఇలేగాం నుంచి నిర్మల్‌కు గుర్రంపై వచ్చాడు. ఆయన బంధువులు చికిత్స కోసం జిల్లాకేంద్రానికి వచ్చారు. గురువారం వారిని చూసేందుకు ఇలా గుర్రంపై రావడంతో ప్రజలు ఆసక్తిగా చూశారు. వాగ్మారే గుర్రపు సవారీ చేస్తుండగా సాక్షి క్లిక్‌ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్‌

అలంకారప్రాయంగా దోబిఘాట్‌



రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూ.40 లక్షలతో జిల్లాకేంద్రంలోని పిట్టలవాడలో అధునాతన యాంత్రీకృత దోబిఘాట్‌ ఏర్పాటు చేసింది. రూ.20 లక్షలతో భవనం నిర్మించగా, మరో రూ.20 లక్షలతో బట్టలను శుభ్రంచేసే యంత్రాలను ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అప్పట్లో మంత్రి హోదాలో ఈ భవనాన్ని ప్రారంభించారు. ప్రారంభమై రెండేళ్లు గడుస్తున్నా సేవలందక ఇప్పటికి అలంకారప్రాయంగానే ఉండటం గమనార్హం.



– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్‌

భర్త గొంతునులిమి హత్యచేసిన భార్య అరెస్టు

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఈ ఘాతుకం
- వివరాలు వెల్లడించిన రూరల్‌ సీఐ రాంబాబు



వివరాలు వెల్లడిస్తున్న కాగజ్‌నగర్‌ రూరల్‌ సీఐ

దహెగాం: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను గొంతునులిమి హత్య చేసిన భార్యను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కాగజ్‌నగర్‌ రూరల్‌ సీఐ రాంబాబు ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పెంచికల్‌పేట్‌ మండలం ఎల్లూర్‌ గ్రామానికి చెందిన సుజాతకు దహెగాంకు చెందిన బండ మల్లేశ్‌తో గత 13 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు కుమార్తె ఉంది. వీరిది వ్యవసాయ కుటుంబం. మల్లేశ్‌ ఇంటి పక్కన ఉన్న గుర్లె రాజు వ్యవసాయం చేస్తుంటాడు. వ్యవసాయ కూలీ పనికి సుజాత వెళ్తుండేది. ఈ క్రమంలో రాజుతో ఆరేళ్ల క్రితం వివాహేతర సంబంధం ఏర్పడింది. వీరి విషయం గతేడాది భర్తకు తెలిసింది. మద్యానికి అలవాటు పడి భార్యతో జరిగిన గొడవలో మల్లేశ్‌కు గాయపడ్డాడు. నాలుగు నెలలుగా విడిపోయి ఉన్నారు. పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి ఏకం చేశారు. అయినా సుజాతలో మార్పు రాలేదు. రాజుతో వివాహేతర సంబంధం కొనసాగించింది. ఈ విషయమై గతనెల 25న భార్యభర్తలు గొడవపడ్డారు. వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని ఎలాగైనా తొలగించుకోవాలని రాజు ప్రోత్సాహంతో గొంతు నులిమింది. తర్వాత కరీంనగర్‌ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించి ఇంటికి తీసుకవచ్చారు. మాట రాకపోవడంతో గతనెల 28న తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి అన్నయ్య బండ సత్తయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టారు. సుజాత, గుర్లె రాజుని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకి యువతి ఆత్మహత్య



గుర్తుతెలియని యువతి మృతదేహం

బాసర: బాసర గోదావరి నదిలో యువతి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గురువారం సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గజఈతగాళ్లతో బయటకు తీశారు. గోదావరి నది ఒడ్డున రూ.3 వేల నగదు, బ్యాగులో బంగారు గొలుసు, మెట్రో ఐడీ కార్డు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్‌ తెలిపారు.

చికిత్సపొందుతూ వివాహిత మృతి



జంగుబాయి మృతదేహం

గుడిహత్నూర్‌: మండలంలోని ఉమ్రి (బి) గ్రామానికి చెందిన వివాహిత మడావి జంగుబాయి (26) రిమ్స్‌లో చికిత్సపొందుతూ మృతి చెందింది. ఎస్సై ఇమ్రాన్‌ కథనం ప్రకారం..మృతురాలి తల్లిదండ్రులు గత ఐదేళ్లక్రితం మృతి చెందారు. దీంతో బంధువులు అదే గ్రామానికి చెందిన మహాదుతో వివాహం జరిపించారు. జంగుబాయి కొన్నినెలలుగా మానసికంగా బాధపడుతోంది. ఈ క్రమంలో గతనెల 29న ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్‌ఎస్, బీజేవైఎం నాయకులపై కేసు

చెన్నూర్‌: పట్టణంలో అనుమతి లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసిన 25 మంది బీఆర్‌ఎస్‌ నాయకులు, 8 మంది బీజేవైఎం నాయకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త చట్టం ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు చేపట్టవద్దని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీడ్రైవర్‌కు ఐదేళ్ల జైలు

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన వీరభద్రరావు మృతి కారణమైన లారీడ్రైవర్‌కు ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ. 2వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్‌ జిల్లా సెషన్స్‌ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్‌ గురువారం తీర్పునిచ్చారు. రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్‌ కథనం ప్రకారం .. బెల్లంపల్లి ఓసీపీలో డ్రైవర్‌గా విధులు నిర్వహించే వీరభద్రరావు 2019, సెప్టెంబర్‌ 12న విధులు ముగించుకుని రెబ్బెన వస్తుండగా లారీ ఢీకొట్టింది. వీరభద్రరావు అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య సమ్మక్క ఫిర్యాదుతో కేసు నమోదైంది. లారీడ్రైవర్‌ ఎండీ సలీంని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా పీపీ జగన్మోహన్‌రావు సాక్షులను విచా రించి నేరం రుజువు చేయడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పునిచ్చారు. అలాగే లారీ యజమానికి రూ. వెయ్యి జరిమానా విధించారు.

కలప పట్టివేత

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌ తాళ్లపేట్‌ రేంజ్‌ ఊట్ల బీట్‌ పరిధిలో బైక్‌లపై అక్రమంగా తరలిస్తున్న కలపను అటవీ అధికారులు పట్టుకున్నారు. రేంజ్‌ అధికారి సుష్మారావు కథనం ప్రకారం.. ఊట్ల బీట్‌ పరిధిలో పెట్రోలింగ్‌ చేస్తున్న డీఆర్వో పోచమల్లు, బీట్‌ అధికారి సాయికి బుధవారం రాత్రి కడెం ప్రధాన కాలువ సమీపంలో బైక్‌లు కనిపించాయి. అటువైపు టార్చిలైట్‌ వేయగా, కలప దుంగలను పడేసి బైక్‌లపై పారిపోయారు. మూడు సైజులు, 8 వాసాలు మొత్తం 0.421 సీఎంటీ కలప పట్టుకున్నట్లు రేంజ్‌ అధికారి తెలిపారు. వీటి విలువ రూ.33,844 ఉంటుందని పేర్కొన్నారు.



పట్టుకున్న కలపతో బీట్‌ అధికారి, సభ్యులు

టేకుచెట్ల నరికివేత



స్మగర్లు వదిలేసివెళ్లిన టేకు దుంగ

భీమారం: మంచిర్యాల అటవీ డివిజన్‌ పరిధిలోని భీమారం, ఎలకేశ్వరం బీట్లలో స్మగ్లర్లు గొడ్డళ్లతో టేకు చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లాలో అధికంగా టేకు ప్లాంటేషన్లు ఉన్న ఈ రెండు బీట్లలో నాలుగురోజుల క్రితం దాదాపు 10 చెట్లని తొలగించారు. ఫర్నిచర్‌కు అవసరమైన కర్రని తీసుకుని తరలించారు. అధికారుల రాకను గమనించి అవసరం లేని మిగతా చెట్టు బాగాలను అక్కడే వదిలి వెళ్లారు. గతంలో టేకు వనాల రక్షణకు ఏర్పాటు చేసిన బేస్‌ క్యాంపులు తొలగింపుతో పర్యవేక్షణ కరువైంది. కాగా, భీమా రం, ఎలకేశ్వరం తోపాటు దాంపూర్‌ సెక్షన్‌లో టేకు చెట్ల నరికివేత కొనసాగుతోంది. ఉన్నతాధికారులు వెంటనే పట్టించుకుని టేకు ప్లాంటేషన్లని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.